క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామి సన్నిధిలో నేడు వైఎస్సార్ సీపీ పూజలు

పిఠాపురం: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక టీటీడీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీ, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత తెలిపారు. తిరుపతి లడ్డూ ప్రసాదంలో నెయ్యి కల్తీ జరిగినట్లు అసత్య ప్రచారం చేస్తూ, భక్తుల మనోభావాలను దెబ్బ తీస్తున్న టీడీపీ కుటిల రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నేతలకు, కార్యకర్తలకు, ప్రజలకు ఆమె పిలుపునిచ్చారు.

30న కౌన్సిల్ సమావేశం

పెద్దాపురం: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్నట్లు పెద్దాపురం మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్మన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు నవర విద్యార్థులు

సామర్లకోట: జిల్లా స్థాయి ఆటల పోటీల్లో విశేష ప్రతిభ కనబర్చడంతో మండల పరిధిలోని నవర జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ సత్యవతి తెలిపారు. ఫుట్‌బాల్ పోటీల్లో ఎస్ పాప, జావెలిన్ త్రోలో చాందిని ఎంపికైనట్టు చెప్పారు. రాష్ట్ర స్థాయిలో పల్నాడు జిల్లా వినుకొండలో శనివారం నుంచి జరిగే పోటీల్లో పాల్గొనేందుకు వీరు శుక్రవారం బయలు దేరారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారులు ఎంపిక కావడానికి ఫిజికల్ డైరెక్టర్ ఎస్ జయలక్ష్మి కృషి ఉందన్నారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కుంచే దుర్గబాబు, వైస్ చైర్మన్ గవ్వ హేమకొండయ్యదొర, కో-ఆప్షన్ సభ్యుడు సిద్దు భవన్నారాయణ, గ్రామ పెద్దలు అభినందించారు.

గడియారం స్తంభం పనులు ప్రారంభం


సామర్లకోట రింగ్ సెంటర్‌లో గడియారం స్తంభం పనులు చేస్తున్న కార్మికులు

సామర్లకోట: అసంపూర్తిగా ఉన్న స్థానిక స్టేషన్ సెంటర్‌లోని గడియారం స్తంభం పనులు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. సుమారు ఏడేళ్ల క్రితం వివిధ కారణాలతో గడియారం స్తంభం పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. గడియారం స్తంభాన్ని పూర్తి చేయాలన్న ఉద్దేశంతో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప నిధులు మంజూరయ్యేలా ఇటీవల చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో రూ.16 లక్షలు మంజూరు కావడంతో పనులు ప్రారంభించినట్లు ఇన్‌చార్జి ఏఈ సాగర్ తెలిపారు.

అన్నదానానికి రూ.10,116 విరాళం

సామర్లకోట: పంచారామ క్షేత్రంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన వేల్పూరి శంకరరావు, నాగమణి దంపతులు రూ.10,116 విరాళం అందజేసినట్టు ఈఓ భళ్ల నీలకంఠం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దశమిని పురస్కరించుకుని ఆలయంలో స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకున్న ఆ దంపతులు అన్నప్రసాదాన్ని స్వీకరించిన తరువాత, ఈ విరాళం ఇచ్చినట్టు చెప్పారు. వారికి స్వామివారి ప్రసాదం అందజేశామని ఈఓ తెలిపారు.

నిర్లక్ష్యపు చెద

- మున్సిపాలిటీల్లో మూలన పడిఉన్న సెప్టిక్ ట్యాంకర్లు
- నిరుపయోగంగా పారిశుధ్య వాహనాలు
- స్వచ్ఛాంధ్ర లక్ష్యం నెరవేరేనా..?


సామర్లకోట మున్సిపల్ కార్యాలయంలో ఉన్న సెప్టిక్ క్లీనింగ్ ట్యాంకర్


సామర్లకోట మెప్మా కార్యాలయ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న పారిశుధ్య మినీ వాహనాలు

సామర్లకోట: మున్సిపాలిటీలకు వచ్చిన సెప్టిక్ క్లీనింగ్ ట్యాంకర్ నిరుపయోగంగా మూలనపడడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా సుమారు ఏడు నెలల క్రితం నియోజకవర్గ పరిధిలోని సామర్లకోట, పెద్దాపురం మున్సిపాలిటీలకు సెప్టిక్ క్లీనింగ్ ట్యాంకర్లు వచ్చాయి. మున్సిపాలిటీలకు ఈ ట్యాంకులు వచ్చిన తరువాత ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో, వాటిని ప్రారంభించకుండానే వదలివేశారు. ప్రధాని జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు ఈ నెల 17న ప్రారంభించారు. ఈ కార్యక్రమం కాస్తా ప్రకటనలు, ఫొటోలకే పరిమితమవుతుందని, ఆచరణలో కానరావడం లేదనే విమర్శలు లేకపోలేదు. ప్రతి మున్సిపాలిటీలో ఉన్న బహిరంగ మరుగుదొడ్ల స్థానంలో సామూహిక మరుగుదొడ్లను నిర్మించారు. దీనికితోడు ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో మరుగుదొడ్లు ఉన్నాయి. గత ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ రావడంతో ప్రతి సచివాలయంలోను మరుగుదొడ్లను నిర్మించారు. ఇటువంటి తరుణంలో ఆయా మరుగుదొడ్లకు చెందిన సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేసేవిధంగా ఈ సెప్టిక్ ట్యాంకర్లను అందజేశారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలు రాలేదన్న సాకుతో వాటిని ప్రారంభించకుండానే నిరుపయోగంగా వదలివేయడం విస్మయాన్ని కలిగిస్తోంది.

వాహనాలపై శ్రద్ధ ఏదీ?

మున్సిపాలిటీకి మంజూరు అవుతున్న వాహనాలపై అధికారులు శ్రద్ధ చూపడం లేదనే విమర్శలున్నాయి. గత తొమ్మిదేళ్ల క్రితం రూ.60 లక్షల విలువైన స్వీపింగ్ మెషిన్ వాహనం మున్సిపాలిటీకి వచ్చినా, ఇప్పటికీ దానిని ప్రారంభించకపోవడమే ఇందుకు నిదర్శనంగా చెబుతున్నారు. దాంతో ఆ వాహనం ఇనుప తుక్కుగా మారిపోతోంది. అలాగే గత ప్రభుత్వంలో వచ్చిన తొమ్మిది మినీ పారిశుధ్య వాహనాలు స్వల్ప మరమ్మతులకే అధికారులు నిరుపయోగంగా వదిలి వేశారు. దాంతో అవి కూడా ఇనుప తుక్కుగా మారే అవకాశం ఉన్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


నిరుపయోగంగా ఉన్న స్వీపింగ్ వాహనం

వీటిని కాపాడే బాధ్యత అధికారులదే..



ప్రజాధనంతో ప్రభుత్వాలు ఆయా కార్యాలయాలకు వాహనాలు అందజేస్తాయి. వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. గతంలో అనేక పారిశుధ్య వాహనాలు ఇనుప ముక్కలుగా మారాయి. స్వీపింగ్ వాహనంపై అనేక పర్యాయాలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం. మున్సిపాలిటీకి వచ్చిన మినీ పారిశుధ్య వాహనాలను చిన్న మరమ్మతుల పేరుతో నిరుపయోగంగా వదిలేశారు. ప్రతి వాహనానికి గ్యారంటీ ఉంటుంది. ఆ సమయంలోనే మరమ్మతులు చేయించాలి. అదే పరిస్థితి సెప్టిక్ క్లీనింగ్ ట్యాంకర్‌కు రాకుండా చూడాలి.

– నేతల హరిబాబు, కౌన్సిలర్, సామర్లకోట

వినియోగంలోకి తీసుకువస్తాం



మున్సిపాలిటీకి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి సెప్టిక్ క్లీనింగ్ ట్యాంకర్ వచ్చింది. వాహనం వినియోగానికి సంబంధించి గైడ్‌లైన్స్ రావాల్సి ఉంది. మున్సిపాలిటీలోని ప్రభుత్వ కార్యాలయాల్లో దీనిని ఉపయోగించవలసి ఉంటుంది. వాహనం రిజిస్ట్రేషన్ జరిగింది. డ్రైవరుకు శిక్షణ ఇచ్చి, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి దీనిని వినియోగంలోకి తెస్తాం. మినీ శానిటేషన్ వాహనాలను వినియోగంలోకి తెచ్చేలా, ముందుగా ఒక వాహనాన్ని మున్సిపల్ నిధులతో మరమ్మతులు చేయిస్తాం. స్వీపింగ్ వాహనాన్ని మున్సిపాలిటీ భరించే స్థాయిలో లేదు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తాం.

– ఎ.శ్రీవిద్య, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

ఆర్‌ఐగా మధుసూదనరావు



కొత్తపల్లి: తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐగా ఎస్‌జేకే మధుసూదనరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామ రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ రూరల్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన పొన్నాల ఏలేశ్వరానికి బదిలీ అయ్యారు.

ఉత్సవాలకు పందిరి రాట


పందిరి రాట వేస్తున్న నిర్వాహకులు

సామర్లకోట: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక అయోధ్య రామపురంలో ఉన్న సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద శుక్రవారం పందిరి రాట వేశారు. పోలినాటి సూర్యచంద్రరావు, విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిద్ధాంతి చీమలకొండ ప్రసాద్, తాతపూడి అరుణ్‌వంశీ, బడుగు శ్రీకాంత్, కమిటీ నాయకులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు


రైల్వే వెయిటింగ్ హాల్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సామర్లకోట: స్వచ్ఛత హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త, ఉమ్మి వేయడం వలన కలిగే అనర్థాలను వివరిస్తూ నుక్కడ్ నాటికను ప్రదర్శించారు. ప్రయాణికులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించి, స్వచ్ఛ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్, టిక్కెట్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్ చైతన్య, బుకింగ్ సూపర్‌వైజర్ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

బంగారు, వెండి పుష్పాలతో మరిడమ్మకు పూజలు


పూజల్లో పాల్గొన్న ఈఓ విజయలక్ష్మి, భక్తులు


బంగారు, వెండి పుష్పాలతో పూజలందుకుంటున్న అమ్మవారు

పెద్దాపురం: కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు, బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయవాడలో వరద బాధితుల కష్టాలు తీరాలని మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబురాజు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

మాల ధారణం.. సుమాల తోరణం..


పాదగయ క్షేత్రం పురూహూతికా అమ్మవారి ఆలయం వద్ద భవానీ భక్తుల సందడి


పాదగయ పుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భవానీ భక్తులు

- పాదగయ క్షేత్రంలో భవానీ మాల ధారణలు
- పాదగయకు పోటెత్తుతున్న భక్తులు
- దీక్షలు స్వీకరించిన వేలాది మంది


రాజరాజేశ్వరీ దేవి

పిఠాపురం: శరన్నవరాత్రి ఉత్సవాలు సమీపిస్తుంటే గ్రామాల్లో జై భవానీ నామస్మరణలు మారుమోగుతుంటాయి. దసరాకు నెల రోజుల ముందు నుంచీ భవానీ భక్తులు అమ్మవారి దీక్షలు స్వీకరించి, దసరాకు విజయవాడ కనక దుర్గమ్మను దర్శించుకుని దీక్షలు విరమిస్తుంటారు. ఎర్రటి వస్త్రాలు ధరించి, భవానీ మాలలు వేసుకుని, నిష్ఠతో దీక్షలు చేస్తుంటారు. శరన్నరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని వేలాది మంది భవానీ దీక్షలు స్వీకరించారు. వచ్చే నెల మూడో తేదీ నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పాదగయ క్షేత్రంలో పదో శక్తిపీఠమైన పురూహూతికా అమ్మవారి దివ్య సన్నిధిలో వారం రోజుల నుంచి భవానీ దీక్షా ధారణలు మొదలయ్యాయి. సోమవారం మూడు వేలకు పైగా భక్తులు భవానీ దీక్షలు స్వీకరించారు. ఈ సందర్భంగా భారీగా భక్తులు తరలిరావడంతో పాదగయ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఇక్కడ ప్రతిరోజూ శ్రీరాజరాజేశ్వరీ దేవి, అష్టాదశ శక్తి పీఠాల్లో పదో శక్తి పీఠానికి అధిష్ఠాన దేవతైన పురూహూతికా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. వేలాది మంది భవానీ దీక్షలు చేపట్టడంతో గ్రామాలు ఎరుపెక్కాయి. వారం రోజులుగా పాదగయ క్షేత్రంతో పాటు, గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణాదేవి ఆలయం, ఇతర దేవాలయాల్లో నిత్యం వందల సంఖ్యలో భవానీ మాలలు దరిస్తున్నారు.


భవానీ దీక్షలు స్వీకరిస్తున్న భక్తులు


తాటిపర్తి అపర్ణాదేవి ఆలయంలో భవానీ దీక్ష స్వీకరిస్తున్న డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి

చెరువుగా మారిన చంద్రశేఖర స్వామి రోడ్డు


సామర్లకోట చంద్రశేఖరస్వామి ఆలయం వద్ద చెరువుగా మారిన రోడ్డు


చెరువును తలపించిన స్టేషన్ సెంటర్ రోడ్డు

సామర్లకోట: కొద్దిపాటి వర్షాలకు పాత సామర్లకోటలోని చంద్రశేఖరస్వామి రోడ్డు చెరువుగా మారింది. తుపాను ప్రభావంతో శుక్రవారం పట్టణంలో కుంభవృష్టి కురిసింది. దాంతో చంద్రశేఖరస్వామి ఆలయం వద్ద రోడ్లు చెరువులుగా మారాయి. కల్వర్టు సమీపంలో ఉన్న ఇళ్లలోకి ముంపు నీరు చేరింది. ఆలయం ఎదురుగా ఉన్న కల్వర్టు పూర్తిగా శిథిలం కావడంతో, వర్షపు నీరు ప్రవహించడం లేదని ఆ ప్రాంత ప్రజలు తెలిపారు. వర్షం కారణంగా మఠంసెంటర్, స్టేషన్ సెంటర్, రథంసెంటర్, బస్సు కాంప్లెక్స్‌లు చెరువులుగా మారాయి. డ్రైన్ల ఆక్రమణ వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతున్నట్లు కమిషనర్ శ్రీవిద్య తెలిపారు.

స్తంభించిన జన జీవనం

కొత్తపల్లి: అల్పపీడనం ప్రభావంతో మండలంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ కురిసిన భారీ వర్షానికి జన జీవనం స్తంభించింది. ప్రధాన రహదారులు చెరువులను తలపించాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పలు ప్రాంతాలు జలమయమయ్యాయి.


జలమయమైన పిఠాపురం-ఉప్పాడ రోడ్డు

అర్బన్ బ్యాంకులో ఎన్నికల సందడి


నామినేషన్ సమర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

పిఠాపురం: పిఠాపురం అర్బన్ క్రెడిట్ సొసైటీలో ఎన్నికల నగారా మోగింది. శుక్రవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభించారు. తొలిరోజు ఒకటో నియోజకవర్గం (ఒకటో వార్డు) డైరెక్టరుగా వైఎస్సార్ సీపీ నేత బాలిపల్లి రామచంద్రకుమార్ (రాంబాబు) శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి దుర్గాప్రసాద్‌కు అందజేశారు. రాంబాబు గత పాలకవర్గంలో సొసైటీ చైర్మన్‌గా పని చేశారు. సొసైటీ అభివృద్ధికి, టర్నోవర్, వ్యాపారం పెరిగేలా కృషి చేశారు. ఆయన నామినేషన్ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు తలిశెట్టి వెంకటేశ్వరరావు, రెడ్డెం జనార్దనరావు, బొజ్జా మాణిక్యాలరావు, గొంప శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి రూ.20 కోట్లు


హుస్సేన్‌పురంలో రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

సామర్లకోట: నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరైనట్టు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. శుక్రవారం హుస్సేన్‌పురం గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు తగ్గిన వెంటనే పాడైన రోడ్ల నిర్మాణం చేపడతారన్నారు. సర్పంచ్ మార్ని నాగమణి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పోటీలను పరిశీలించిన ఎంఈఓ


వక్తృత్వ పోటీలో పాల్గొన్న విద్యార్థిని

సామర్లకోట: మండల స్థాయిలో స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం సాయంత్రం జరిగిన వక్తృత్వ, వ్యాసరచన పోటీలను మండల విద్యాశాఖాధికారి వై శివరామకృష్ణయ్య పరిశీలించారు. కాంప్లెక్స్ స్థాయిలో ఎంపికైన వారికి మండల స్థాయిలో పోటీలను నిర్వహించారు. వ్యాసరచన పోటీల నుంచి ఇద్దరు, వక్తృత్వ పోటీల నుంచి ఇద్దరు విద్యార్థులను శనివారం కాకినాడలో జరిగే పోటీలకు ఎంపిక చేశారు. పాఠశాల హెచ్‌ఎం మీనామాధురి పర్యవేక్షించగా, న్యాయ నిర్ణేతలుగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు వ్యవహరించారు.

సినిమాలు



పెద్దాపురం	
లలితా స్క్రీన్-1	దేవర
లలితా స్క్రీన్-2	సత్యం సుందరం
వీరభద్ర	దేవర
శోభా	భలే ఉన్నాడే
సామర్లకోట	
అనుశ్రీ స్క్రీన్-1	దేవర
అనుశ్రీ స్క్రీన్-2	దేవర
విఘ్నేశ్వర	మత్తు వదలరా 2
పిఠాపురం	
అన్నపూర్ణ	మత్తు వదలరా 2
పూర్ణ	టూ షోస్ చెక్ లేట్
పూర్ణ 2	దేవర
శ్రీసత్య	దేవర
శ్రీవెంకటేశ్వర	దేవర
ఉప్పాడ	
శ్రీనివాస	మత్తు వదలరా 2

అశాంతికి సంపదే కారణం


స్వామిజీని సత్కరిస్తున్న సమితి సభ్యులు

సామర్లకోట: మండల పరిధిలో పీబీ దేవంలోని శ్రీశారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం సత్సంగం నిర్వహించారు. ఉత్తరాంధ్ర రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ అధ్యక్షుడు, రామకృష్ణ మిషన్ ఆశ్రమం, విశాఖపట్నం కార్యదర్శి స్వామి స్వసంవేద్యానంద మహరాజ్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. రామకృష్ణ సేవా సమితి చేస్తున్న కార్యక్రమాలను తెలుసుకుని, ఆనందం వ్యక్తం చేశారు. మనిషి తన కోసం ఆరాటం పడటం తప్పు కాదని, తరతరాల కోసం సంపదను పోగుచేయాలనే యావతో అశాంతికి గురవుతున్నారని బోధించారు. దేవునిపై పరిపూర్ణమైన భక్తి, విశ్వాసం ఉంచిన నాడు ఎటువంటి అశాంతి ఉండదని పేర్కొన్నారు. స్వామిజీకి సేవా సమితి తరపున జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి కార్యదర్శి వింజమూరి విశ్వనాథ్, సభ్యులు నువ్వుల వెంకటరాజు, తోటకూర వీరవెంకట సత్యనారాయణ, నువ్వుల బాబ్జీ, సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో మున్సిపల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ


ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం సాయిరామకృష్ణ

సామర్లకోట: స్కూల్ గేమ్స్‌లో స్థానిక బచ్చు పౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు మంచి ప్రతిభ చూపి జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ విషయాన్ని పాఠశాల హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ శుక్రవారం సాయంత్రం విలేకర్లకు తెలిపారు. అండర్-14 బాలికల విభాగం ఖోఖోలో పి.జ్యోత్స్న దుర్గసాయి, జి.లక్ష్మీవర్షిణి, పి.దుర్గసృజన, జిల్లా స్థాయికి ఎంపిక కాగా, కె యశ్వంత్ రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్టు వివరించారు. వీరిని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ప్రతినిధులు, విశ్రాంత పీడీ తాళ్లూరి వైకుంఠం, కోచ్ రవి, ఉపాధ్యాయులు అభినందించారు.

మూడు నుంచి శరన్నవరాత్ర ఉత్సవాలు


పంచారామ క్షేత్రంలోని బాలాత్రిపుర సుందరిదేవి

సామర్లకోట: పంచారామ క్షేత్రంలో ఉన్న బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో వచ్చే నెల మూడో తేదీ నుంచి 12 వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ భళ్ల నీలకంఠం తెలిపారు. మూడో తేదీ ఉదయం విఘ్నేశ్వర పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. నిత్యం ఉదయం, సాయంత్రం అమ్మవారి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రతి రోజు అమ్మవారు ఒక దేవతామూర్తిగా భక్తులకు దర్శనం ఇస్తారు. మూడున బాలాత్రిపుర సుందరీ దేవిగాను, 4న శ్రీఅన్నపూర్ణదేవిగా, ఐదున శ్రీగాయత్రిదేవిగా, 6న శ్రీలలితాదేవిగా, 7న శ్రీకామాక్షిగా, 8న శ్రీమహాలక్ష్మిగా, 9న సరస్వతీదేవిగా, పదిన శ్రీవిజయదుర్గగా, 11న శ్రీమహిషాసురమర్దనిగా, 12న శ్రీరాజరాజేశ్వరిగా భక్తులకు దర్శనమిస్తారు. ప్రతి రోజు మధ్యాహ్నం అమ్మవారికి చేసిన అలంకరణ మరుసటి రోజు మధ్యాహ్నం వరకు ఉంటుంది. చివరి రోజు సాయంత్రం అమ్మవారికి వెండి చీర అలంకరణ ఉంటుందని ఈఓ వివరించారు. రూ.200 చెల్లిస్తే శరన్నవరాత్రుల సందర్భంగా ప్రతి రోజు గోత్ర నామాలతో సాయంత్రం కుంకుమార్చన చేస్తారని చెప్పారు.

మండల పరిషత్ ఏఓగా చలమయ్య



కొత్తపల్లి: కొత్తగా మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారిగా వాడ్రేవు చలమయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా పెదపూడి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన వి.సూర్యప్రకాష్ జెడ్పీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా చలమయ్యను పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.